గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

భీమవరం టౌన్: స్థానిక జెపి రోడ్డులోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ కాలంలోనే గ్రంథాలయ ఉద్యమం సాగిందని, ఆనాడే గ్రంథాలయ ఉద్యమ నాయకుడిగా అయ్యంకి వెంకటరమణయ్య కీర్తి గడించారని అన్నారు. ప్రపంచ మేధావులంతా గ్రంథాలయాల ద్వారా ప్రగతి సాధించారని తెలిపారు. 56 ఏళ్లుగా ప్రభుత్వాలు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నాయని, స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వాములై నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు పట్టణంలోని గ్రంథాలయంలో వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, ఆలయ ఇఒ ముదునూరి సత్యనారాయణరాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, కలిగొట్ల గోపలశర్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అపార్ కష్టాలు.. ఆధార్ దోపిడీ..!

ఆధార్ సెంటర్ల వద్ద తల్లిదండ్రులు, విద్యార్థుల పడిగాపులు

పుట్టిన తేదీ, పేరు మార్పు కోసం నానావస్థలు

ఉచితం, రూ.50 ఖర్చు సేవలకు సైతం రూ.150కుపైగా వసూలు

బర్త్ సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వాసుపత్రి, మున్సిపల్ కార్యాలయాల్లో నరకం

ఆధార్ వివరాలు కీలకం కాదన్న సుప్రీం తీర్పుకు విరుద్ధంగా వ్యవహారం

నూజివీడు ఆధార్ సెంటర్ వద్ద బారులు తీరిన జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు తెచ్చిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అక్కౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు ఒకపక్క, ఇదే అదునుగా ఆధార్ సెంటర్లలో దోపిడీతో మరోపక్క జనం ఉక్కిరిబిక్కిరవుతున్న పరిస్థితి నెలకొంది. ఆధార్‌లో వివరాలు కీలకం కాదని సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. విద్యార్థి బర్త్ సర్టిఫికెట్‌లో తేదీ, పేరు సక్రమంగా ఉన్నప్పటికీ ఆధార్‌లో తప్పుగా ఉందని, సరిచేసుకోవాలని విద్యార్థులను నానావస్థలకు గురి చేస్తున్నారు. ఆధార్ కార్డులు జారీ చేసిన సమయంలో పేర్లు, పుట్టిన తేదీలు, తల్లిదండ్రుల పేర్లు తప్పులతడకగా నమోదు చేశారు. అధికారులు చేసిన తప్పులకు ఇప్పుడు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శిక్ష అనుభవించాల్సి వస్తోంది. 'అపార్' కోసం ఆధార్ కార్డుల్లో తప్పులు సరిచేసుకునేందుకు రెండు జిల్లాల్లోని విద్యార్థులు నానావస్థలు పడుతున్నారు. బుధవారం చివరిరోజు అని చెప్పినప్పటికీ విద్యార్థుల సమస్యలు పరిష్కారం ఎప్పటికవుతుయో తెలియని పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో 34 ఆధార్ సెంటర్లు మాత్రమే ఉన్నాయి. పశ్చిమలోనూ అదే పరిస్థితి. ఆధార్ సెంటర్లు ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆధార్ సెంటర్ల వద్ద జనం పడిగాపులు పడుతున్నారు. పట్టణాల్లోని ఆసుపత్రుల్లో పుట్టిన వారి వివరాలు మున్సిపాల్టీ, కార్పొరేషన్ పరిధిలో ఉంటాయి. పుట్టిన సమయంలో పాప, బాబు అంటూ నమోదు చేసిన పరిస్థితి ఉంది. ఇప్పుడు పేరు నమోదు చేయించుకోవాల్సి ఉండగా మున్సిపాలిటీ, కార్పొరేషన్ అధికారులు ఏమాత్రం సహకరించడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పుట్టిన పిల్లలకు సంబంధించి జారీ చేసిన పత్రాల్లో అప్పటి సిబ్బంది వివరాలు తప్పులతడకగా నమోదు చేశారు. అవి సరిచేసుకునేందుకు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా శనివారం మాత్రమే దరఖాస్తులు తీసుకుంటామని, తర్వాత శనివారానికి పూర్తి చేస్తామని చెబుతుండటంపై జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క సమయం ముగుస్తుందని చెబుతూ, మరోపక్క ఇలాంటి ఆంక్షలు పెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమందికి పంచాయతీల్లోగాని, మున్సిపాలిటీల్లోగాని పుట్టిన తేదీ నమోదు కాలేదు. అలాంటి వారు ఇప్పుడు తల్లి, తండ్రి పుట్టిన పంచాయతీల నుంచి నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్లు తెచ్చుకోవాలి. విఆర్ఒ, ఆర్ఐ, తహశీల్దార్, ఆర్‌డిఒ సంతకం చేస్తే తప్ప బర్త్ సర్టిఫికెట్ రాదు. ఇది జరగడానికి తక్కువగా లెక్కించినా 20 రోజులు వ్యవధి తీసుకుంటున్నారు. ఆసుపత్రుల్లో పరిస్థితి మరోలా ఉంది. సమస్యలు పరిష్కరించకుండా ఆఖరు తేదీ అయిపోతుందంటూ జనాన్ని ఇబ్బంది పెట్టడంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించి తర్వాత అపార్ నమోదు చేయాలని అంతా కోరుతున్నారు.

ఆధార్ అప్‌డేట్‌లో దోపిడీ పర్వం

'అపార్' కోసం ఆధార్ సెంటర్లకు వెళ్తున్న జనం నుంచి నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. నిబంధనల ప్రకారం ఆధార్ అప్‌డేట్‌కు సంబంధించి మూడు రకాల కేటగిరీలు ఉన్నాయి. ఉచితంగా చేసే సేవలు, రూ.50 రుసుముతో, రూ.వంద రుసుముతో చేసేవి ఉన్నాయి. కేటగిరీలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి నుంచి రూ.150 వరకూ వసూలు చేస్తున్నారు. కొన్నిచోట్ల అంతకంటే ఎక్కువ కూడా వసూలు చేస్తున్న పరిస్థితి. ఆధార్ కార్డు తొలిసారి అప్‌డేట్ చేయించుకునేవారికి ఉచితంగా చేయాలి. అలా ఎక్కడా చేయడం లేదు. ఆధార్ అప్‌డేట్ పూర్తయిన తర్వాత ఫ్రీ సర్వీస్ అంటూ జనానికి మెసేజీలు వస్తున్నాయి. దీనిపై ఇదేమిటని అడిగినా సమాధానం చెప్పడం లేదు. ఆధార్ సెంటర్లు తీసుకున్న ఏజెన్సీలకు 30 శాతం వరకూ కమీషన్ ప్రభుత్వం ఇస్తోంది. ఆధార్ సెంటర్‌లో నియమించుకున్న ఉద్యోగులకు వారే జీతాలు ఇచ్చుకోవాలి. అయితే ఏజెన్సీలు సరిగా జీతాలు ఇవ్వడం లేదు. అంతటితో ఆగకుండా అదనంగా డబ్బు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. ఆధార్, అపార్ సమస్యల పేరుతో జనానికి నరకం చూపిస్తున్న పరిస్థితి నెలకొంది.

రెండో రోజు కొనసాగిన ఐటి దాడులు

గ్రంధితోపాటు వ్యాపారుల ఇళ్లలోనూ తనిఖీలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆదాయపు పన్ను (ఐటి) శాఖాధికారులు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ పహారా మధ్య భీమవరంలో రెండోరోజు గురువారం కూడా తమ దాడులు కొనసాగించారు. తొలిరోజు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో దాడులు ప్రారంభించిన ఐటి అధికారులు అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగించారు. మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ నివాసం, వ్యాపార సముదాయాలతోపాటు భీమవరంలోని మరికొందరు వ్యాపారులు, రియల్టర్ల నివాసాలు, కార్యాలయాల్లో గురువారం సోదాలు నిర్వహించారు. పట్టణంలోని వెంకయ్య నాయుడు వీధిలోని ప్రమద ఆయిల్స్, ప్రమద ఆక్వా ప్రయివేట్ లిమిటెడ్ ప్రొప్రయిటర్ వై.ప్రసాదరావు కార్యాలయంలో, చుండూరు వారి వీధిలోని వై.ప్రసాదరావు నివాసంలో ఐటి అధికారులు తనిఖీలు చేశారు. ప్రముఖ రియల్టర్ జానీ నివాసం, కార్యాలయంలో కూడా సోదాలు కొనసాగుతున్నాయి. అయితే జానీ హైదరాబాద్‌లో ఉండటంతో కుటుంబ సభ్యులు, ఉద్యోగుల నుంచి అధికారులు వివరాలు తెలుసుకుంటున్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ వ్యాపారి, లేఖరి యర్రంశెట్టి నాగేశ్వరరావుకు చెందిన భీమనాధం వారి వీధిలోని నివాసంలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సుంకర చిన్న నివాసంలోనూ సోదాలు కొనసాగుతున్నాయి. దీంతోపాటు గ్రంధి శ్రీనివాస్‌కు చెందిన కృష్ణా జిల్లా నాగాయలంక, ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని సాగర్ గ్రంధి ఎక్స్‌పోర్ట్స్ ప్రయివేటు లిమిటెడ్‌లోనూ ఐటి అధికారుల దాడులు కొనసాగాయి. పేదలకు ఇళ్ల నిర్మాణం నిమిత్తం మాజీ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ రైతుల నుంచి భూములు తక్కువ ధరకు సేకరించి, ప్రభుత్వానికి ఎక్కువ ధరకు విక్రయించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ దాడులు జరగడం కలకలం సృష్టిస్తోంది.

పద్ధతులు మార్చుకోకపోతే కఠిన చర్యలు

రెవెన్యూ విభాగంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు : కలెక్టర్ సి.నాగరాణి

రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ఉద్యోగులంతా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందుండాలని, అవినీతి ఆరోపణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్లో రెవెన్యూ విభాగాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు సెక్షన్లలోని ఫైల్స్‌ను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత ఉద్యోగులపై ప్రశ్నల వర్షం కురిపించారు. రోజుకు ఎన్ని గ్రీవెన్స్ వస్తున్నాయి, వాటికి సరైన సమయంలో సమాధానాలు ఇస్తున్నారా, వ్యక్తిగత రిజిస్టర్లు ఎందుకు మెయింటైన్ చేయట్లేదు, వివిధ బిల్లుల చెల్లింపులు సకాలంలో చేస్తున్నారా, రికార్డులను పక్కాగా మెయింటైన్ చేస్తున్నారా, ఫైల్స్‌ను నిర్ణీత సమయంలో డిస్పోజ్ చేస్తున్నారా, ప్రజలు ఇబ్బంది పడేలా వ్యవహరిస్తున్నారా వంటి ప్రశ్నలను సంధించారు. అందరం ప్రభుత్వ జీతం తీసుకుని పని చేస్తున్నామని, అవినీతి ఆరోపణలకు ఎట్టి పరిస్థితుల్లో తావు ఉండకూడదన్నారు. 'నా ఆదేశాలు హెచ్చరికగా, లేదా సూచనలుగా భావిస్తారో మీ ఇష్టం, ఇక నుండి ఏ విషయమైనా నా దృష్టికి వస్తే పక్కాగా చర్యలు ఉంటాయి' అని హెచ్చరించారు. ఆమె వెంట జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జి కలెక్టరేట్ పరిపాలనాధికారి శేఖర్, వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నేటి నుంచి ప్రజాపోరు

సిపిఎం మండల మహాసభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్

మాట్లాడుతున్న జెఎన్‌వి గోపాలన్

ప్రజాశక్తి - పెనుగొండ

సమస్యల పరిష్కారానికి ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి సిపిఎం చేపడుతున్న ప్రజాపోరు ప్రచార యాత్రలను, 14న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాల్లో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. గురువారం వడలి గ్రామంలో ఆ పార్టీ ఆరో మండల మహాసభ వేడంగి సర్వేశ్వరరావు, షేక్ పాదుషా అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి గోపాలన్ మాట్లాడుతూ దేశాన్ని పట్టిపీడిస్తున్న నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, పేదరికం వంటి సమస్యల పరిష్కారానికి పోరాటాలే పరిష్కారమని అన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ రానున్న కాలంలో ప్రజా సమస్యలపై పోరు ఉధృతం చేయాలన్నారు. స్థానిక సమస్యలతోపాటు కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, కార్మికుల సమస్యలపై పోరాడాలన్నారు. మండల కార్యదర్శి సూర్నీడి వెంకటేశ్వరరావు ప్రవేశ పెట్టిన కార్యకలాపాల నివేదికపై ప్రతినిధులు చర్చించి ఆమోదించారు. అనంతరం నూతన మండల కార్యదర్శిగా షేక్ పాదుషాను ఎన్నుకున్నారు. ఈ మహాసభలో నేతలు కె.రత్నరాజు, ఎ.శ్రీనివాసరావు, కె.జగన్నాధం తదితరులు పాల్గొని మాట్లాడారు.

కొనసాగిన విఒఎల నిరసనలు

తణుకులో నిరసన తెలుపుతున్న విఒఎలు

ప్రజాశక్తి - తణుకు

ఎనిమిది నెలల విఒఎల పెండింగ్ వేతనాలు వెంటనే కూటమి ప్రభుత్వం చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో విఒఎలు సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ విఒఎలపై గత ప్రభుత్వం తీసుకొచ్చిన వాటిని కూటమి ప్రభుత్వం కొనసాగించడం ఆపాలన్నారు. విఒఎలకు ఇవ్వాల్సిన ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎన్.ఆదినారాయణ బాబు, కార్యదర్శి గుబ్బల గోపి, గార రంగారావు, రాజేశ్వరి, పార్వతి, లీలావతి, మహాలక్ష్మి, దీప్తి, దేవి, వెంకటరమణ, రత్నం పాల్గొన్నారు.

మొగల్తూరు : విఒఎల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ కోరారు. మొగల్తూరులోని వెలుగు కార్యాలయం వద్ద మంగళవారం విఒఎలు చేపట్టిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆయన కోరారు. మహిళా మార్ట్‌లో బలవంతపు సరుకులు కొనుగోలు ఆపాలని, నిబంధనలకు విరుద్ధంగా విఒఎలను తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రేపు విజయ, వాటాల వెంకటలక్ష్మి, దేవీదుర్గ, ఆర్.విజయ పాల్గొన్నారు.

అర్హులందరికీ దీపం - 2 అమలు

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డిఆర్ఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని అర్హులందరికీ ఉచిత గ్యాసు సిలిండర్ల సరఫరా పథకం (దీపం-2) అమలుకు అన్ని చర్యలూ తీసుకున్నామని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కలెక్టరేట్లో దీపం-2 పథకంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెల్ల రేషన్ కార్డు కలిగి జిల్లాలో వినియోగంలో ఉన్న అన్ని రకాల గ్యాసు కనెక్షన్ల వినియోగదారులు ఈ పథకానికి అర్హులేనని చెప్పారు. అయితే వారంతా తప్పనిసరిగా ఆధార్, రేషన్ కార్డులతోపాటు బ్యాంకు ఖాతా కలిగి ఉండి ఇకెవైసి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. జిల్లాలోని 5,67,651 బియ్యం కార్డుదారులకుగాను ఇప్పటి వరకూ 4,52,394 మంది బియ్యం కార్డుదారులను దీపం-2 పథకానికి అర్హులుగా ఎంపిక చేశామన్నారు. ఇంకా 1,15,257 మంది బియ్యం కార్డుదారులు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఎక్కౌంటును ఇకెవైసి పూర్తి చేసుకోవాల్సి ఉందన్నారు. ఇకెవైసి పూర్తి చేసిన తరువాత మాత్రమే దీపం-2 పథకంలో వారు అర్హులుగా ఎంపికవుతారని స్పష్టం చేశారు. ఇకెవైసి కోసం ఎవరూ గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లనవసరం లేదని, సంబంధిత గ్యాసు డెలివరీ బోయ్స్ స్వయంగా గ్యాస్ వినియోగదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఉచితంగానే ఇకెవైసి పూర్తి చేస్తారని తెలిపారు. సిలిండరు పొందిన 48 గంటలలోగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు వారు చెల్లించిన మొత్తం జమ అవుతుందన్నారు. దీపం-2 పథకంలో ఇప్పటి వరకు మొదటి ఉచిత సిలిండరు కోసం బుకింగు చేసుకున్న లబ్ధిదారుల సంఖ్య 1,03,325 మందిగా ఉందన్నారు. సిలిండర్ పొందిన వారికి విడుదలైన సొమ్ము రూ.2.90 కోట్లు అని తెలిపారు. ఈ పథకం అమలుపై ఏమైనా సందేహాలుంటే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా కాని, టోల్ ఫ్రీ నెంబర్ 1967కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. సమావేశంలో డిఎస్ఒ ఎన్.సరోజ, ఎఎస్ఒ ఎం.రవిశంకర్ పాల్గొన్నారు.

ఆర్చరీలో తిరుమల విద్యార్థినులకు పతకాలు

విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మన్యం జిల్లా పార్వతీపురంలో ఇటీవల జరిగిన ఎపి ఎస్‌జిఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆర్చరీ టోర్నమెంట్‌లో భీమవరం తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థినులు బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా గురువారం తిరుమల జూనియర్ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు, డైరెక్టర్లు ఎస్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆర్చరీ టోర్నమెంట్ అండర్-19 కాంపౌండ్ బాలికల విభాగంలో తమ విద్యార్థినులు శరణ్య రెండు స్వర్ణ పతకాలు, రవ్వడ రూప చంద్రహాసిని రెండు వెండి పతకాలు సాధించడం అందరికీ గర్వకారణమన్నారు. పతకాలు సాధించిన ఇరువురు విద్యార్థినులు ఈ నెల 15, 16 తేదీల్లో గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అక్కడ కూడా వీరు గురి తప్పకుండా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం పొందాలన్నారు. పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు. ప్రోత్సహించి, సహకరించిన వారి తల్లిదండ్రులకు , సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

ఎస్‌కెఎస్‌డి విద్యార్థిని ప్రతిభ

తణుకు: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రాస్‌కంట్రీ (ఉమెన్) ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్సిటీ సెలక్షన్స్ ఈ నెల 4వ తేదీన ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరంలో జరిగాయి. ఈ పోటీల్లో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల విద్యార్థిని బి.నాగలక్ష్మీదుర్గ (బికాం, ఒకేషనల్) ప్రథమ స్థానం గెలుచుకుందని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యుఎల్ సుందరీబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా సుందరీబాయ్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరపున ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ మంగుళూర్ యూనివర్సిటీలో నిర్వహించే ఆల్ ఇండియా క్రాస్‌కంట్రీ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.రత్నకుమారి పాల్గొన్నారు.

మినీబస్సును ఢీకొన్న ఆటో

ఏడుగురు కూలీలకు గాయాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆగి ఉన్న మినీబస్సును ఆటో ఢీకొన్న ఘటన గురువారం తెల్లవారుజామున పెద్దతాడేపల్లి కాపు కళ్యాణ మండపం సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురికి గాయాలవ్వగా వీరిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రూరల్ పోలీసులు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా భీమడోలు, వడ్లపాడు గ్రామాల నుండి ఉపాధి నిమిత్తం 16 మంది మహిళలు దువ్వ గ్రామంలోని రొయ్యల ఫ్యాక్టరీకి ప్రతిరోజూ ఆటోలో వెళ్తొస్తుంటారు. రోజులాగానే గురువారం తెల్లవారుజామున 16 మంది మహిళా కూలీలు ఆటోలో బయల్దేరారు. బాదంపూడి జంక్షన్ దాటి పెద్ద తాడేపల్లి సమీపంలోకి వచ్చేసరికి ఆగి ఉన్న మినీ బస్సును ఆటో ఢీకొంది. స్థానికులు స్పందించి హుటాహుటీన గాయాల పాలైన కూలీలను అంబులెన్స్‌లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో వంగ పద్మావతి (48) తలకు బలమైన గాయం కావడంతో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాల పాలైన పి.అనసూయ (27), మౌనిక (24), కుసుమ కుమారి (28)లను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ తాతారావు తెలిపారు. మరో ముగ్గురు స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికత్స పొందుతున్నారు. మరో తొమ్మిది మందికి స్వల్ప గాయాలే కావడంతో చికిత్స పొంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు తాతారావు తెలిపారు. రూరల్ ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచమెక్కిన మడుగుపోలవరం లంక

స్పందించని వైద్యఆరోగ్య శాఖ

మడుగుపోలవరంలంకలో పక్షవాతంతో ఇబ్బంది పడుతున్న మహిళ

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని మడుగుపోలవరం లంక గ్రామంలో ఇంటికో మనిషి జ్వరంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏ ప్రభుత్వ సిబ్బందీ ఇటుగా వచ్చి పరిశీలించిన దాఖలాల్లేవు. మడుగుపోలవరం పంచాయతీ పరిధిలో ఉన్న ఈ లంకలో సుమారు వెయ్యి మంది జనాభా నివశిస్తున్నారు. ఇక్కడ అంతా బిసి సామాజిక తరగతికి చెందిన వారే ఉన్నారు. నెల రోజులుగా ఇక్కడి ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నా వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది ఇటువైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవని వాపోతున్నారు. దీంతో ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని, వేలకు వేలు వెచ్చించాల్సి వస్తుందని జ్వరపీడితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్షవాతానికి గురైన దొంగ మంగ కొద్ది రోజులుగా జ్వరంతో ఇబ్బంది పడి ప్రస్తుతం కోలుకుంటోంది. మల్లుల సాయి అనారోగ్యం పాలై ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో పాలకొల్లులోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చేరారు. తాగునీటి సమస్య వల్లే తామంతా జ్వరాలబారిన పడ్డామని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై నాయకులుగాని, వైద్య సిబ్బందిగాని పట్టించుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెలకోసారి ఎఎన్ఎం, ఆశాలు రావడం తప్ప ఉపయోగం లేదని పెదవివిరుస్తున్నారు. జ్వరపీడితులంతా సమీపంలోని నవుడూరు, పాలకొల్లు, రాయకుదురుల్లోని ప్రయివేటు వైద్యులను ఆశ్రయించి కోలుకుంటున్నామంటున్నారు. గ్రామానికి ఆనుకుని మేజర్ మురుగుకాలువ ఉన్నా ఈ గ్రామంలో అంతర్గత డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ మురుగు గుంతలు దర్శనమిస్తున్నాయి. అపారిశుధ్యం తాండవిస్తోంది. దీంతో పరిస్థితి దిగజారిందని తెలుస్తోంది. ఇప్పటికైనా తక్షణమే ఈ గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరపీడితులకు వైద్యం అందించాలని, గ్రామంలో పారిశుధ్యం మెరుగుకు, రక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

జాతీయస్థాయి పోటీలకు మాంటిస్సోరి విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్

తణుకు: 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో స్థానిక మాంటిస్సోరి స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని కె రీనాసమీక్షారెడ్డి రెండోస్థానంలో నిలిచి వెండి పతకం సాధించారని ఆ స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. అండర్-19 రికర్వ్ బాలికల విభాగంలో 9వ తరగతి విద్యార్థిని ఎన్.హాంసిని మూడోస్థానంలో నిలిచి రజత పతకం గెలుచుకున్నారన్నారు. వీరు ఈ నెల పదో తేదీ నుండి 20వ తేదీ వరకు గుజరాత్‌లో జరుగబోయే 68వ (ఎస్‌జిఎఫ్ఐ) జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. తమ విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం తమకు గర్వకారణంగా ఉందని తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ ఎస్.సోమశేఖర్‌ను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను స్కూల్ డైరెక్టర్ ప్రకాశరావు అభినందించారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రణాళిక రూపొందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పక్కా ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ నాగరాణి గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ 2027లో గోదావరి పుష్కరాలు రానున్నాయని, దీనికి సంబంధించిన ఏర్పాట్లను ముందు నుండే పక్కా ప్రణాళికతో ఉండాలని సూచించారు. జిల్లాలో ప్రధానంగా 33 పుష్కర ఘాట్లు ఉన్నాయని, ఆచంట, నరసాపురం, పెనుగొండ, యలమంచిలి మండలాల ఘాట్లపై క్షేత్రస్థాయిలో చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించి నివేదికను సమర్పించాలన్నారు. ఆర్ అండ్ బి శాఖ రహదారులు, అంతర్గత రహదారులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తాగునీరు, క్లోరినేషన్ అంచనాలను రూపొందించాలన్నారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ బందోబస్తు, పార్కింగ్ ప్రణాళికలను సిద్ధం చేయడం జరుగుతుందని, అలాగే వివిధ ఫోర్సుల సహకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, నరసాపురం ఆర్‌డిఒ. దాసి రాజు, జల వనుల శాఖ అధికారి నాగార్జున, డిపిఒ. అరుణశ్రీ, ఆర్డబ్ల్యుఎస్ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..
బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు : ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి - తణుకు

నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి హెచ్చరించారు. గురువారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లింధలపర్రు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న గుబ్బల వెంకట సత్యనారాయణను అరెస్టు చేసి అతని వద్ద నుంచి 20 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కొత్త మద్యం పాలసీ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకూ మొత్తం ఎనిమిది మంది బెల్ట్ షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుండి 139 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో తణుకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి, ఎస్ఐలు బి.లక్ష్మి, ఆర్.మధుబాబు పాల్గొన్నారు.

10.30 తరువాత రోడ్లపై తిరిగితే కేసే : సిఐ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి 10:30 గంటలు దాటిన తర్వాత సరైన కారణాలు లేకుండా రోడ్లపై తిరిగితే కేసు నమోదు చేస్తామని పట్టణ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎస్ ఇన్‌స్పెక్టర్ పి.నాగరాజు, స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం రాత్రి 10 గంటల నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, రోడ్లపై అనధికారంగా తిరుగుతున్న సుమారు 30 మందిపై కేసులు నమోదు చేసి వారికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సిఐ తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు బాబ్జి సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కొండ్రుప్రోలులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన కుటుంబానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) బియ్యం, దుస్తులు, వంట సామగ్రి అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బాబ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, వాడపల్లి సుబ్బరాజు, రాజులపాటి సత్యనారాయణ, ఉప్పలపాటి భాస్కరరావు, మార్గాపుడి వెంకటేశ్వరరావు, జాస్తి సురేష్, జాన బాలాజీ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్‌కుమార్ తెలిపారు. గురువారం నరసాపురం 5వ వార్డులో ఆయన విలేకరులతో మాట్లాడారు. నరసాపురంలో తాగునీరు అధ్వానంగా ఉందని, కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నప్పటికీ, ఆ నీరు కలుషితం అవుతోందన్నారు. దీనిపై మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్‌కు ఎన్నిసార్లు తెలియజేసినా ఎటువంటి స్పందన లేదన్నారు. ఎంఎల్ఎ చొరవ తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

ఆలయ నిర్మాణానికి భారీ విరాళం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని ఒకటో వార్డు లాకు వద్ద శ్రీభవానీ అమ్మవారి ఆలయ పునఃనిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త పడాల సురేష్ రూ.11,11,116 భారీ విరాళం అందించారు. తాను విరాళం ఇవ్వడమే కాకుండా ఫ్రెండ్ సర్కిల్ నుంచి మరికొంత నగదు అందించే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా పడాల సురేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సురేష్‌ను ఆలయ కమిటీ సత్కరించింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెనుమంట్ర:మండలంలోని రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ.జ్యోతిలా తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మి ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరను పొందాలని కోరారు. ధాన్యం సాధారణ రకానికి మద్దతు ధర క్వింటాలుకు రూ.2,300, ఎ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2,320లుగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ శాఖ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆచంట:ఈనెల 8వ తేదీ శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.మధుకుమార్ తెలిపారు. 33 కెవి పెనుగొండ -వల్లూరు ఫీడర్ లైన్స్ మెయిన్ టెయిన్స్, 11 కెవి ఫీడర్స్ మెయిన్ టెయిన్స్, చెట్ల కొమ్మల ఆకులు తొలగింపు కారణంగా ఆచంట మండల పరిధిలోని గ్రామాలైన ఆచంట, ఆచంట వేమవరం, కొడమంచిలి, కోడేరు, పెదమల్లం, వల్లూరు, భీమలాపురం, కరుగోరుమిల్లి, కందరవల్లి అయోధ్యలంక, పోడూరు మండలంలోని వద్దిపర్రులో ఉదయం 8.00 నుండి మధ్యాహ్నం 11.00 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పాలకొల్లు : పాలకొల్లు పట్టణ, ఫీడర్, రాజీవ్ నగర్ ఫీడర్ వద్ద లైన్ మైంటెన్స్ నిమిత్తం ఈనెల 8 శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఇఇ మధు కుమార్ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ఎంఎల్ఎ

నరసాపురం:గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. గురువారం జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని సర్పంచులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్యుత్ తదితర అంశాలపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రభుత్వం ఏర్పాటు అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

డిఎన్ఆర్‌లో బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పాలకొల్లు :ప్రస్తుత సమాజంలో ఎక్కువ మంది అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ చెప్పారు. డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నన్నయ్య యూనివర్సిటీ అంతర్ కళాశాల మహిళా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ ప్రస్తుతం యూనివర్సిటీ సెలక్షన్స్ కూడా ఇక్కడే జరుగుతుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోటా 3 శాతం పెంచిందని దీన్ని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్ రమేష్ మాట్లాడారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రతి ధాన్యపు గింజా మద్దతు ధరకే కొనుగోలు

ఆర్‌డిఒ ప్రవీణ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - గణపవరం

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజ మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం సిహెచ్ అగ్రహారంలో ఆర్‌డిఒ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని వారికి నచ్చిన రైసు మిల్లుకు అమ్ముకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 2024-25 గాను సాధారణ రకం క్వింటాలుకు రూ.2,300, గ్రేడ్ ఎ రకం క్వింటాలుకు రూ.2,320గా మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రైతులు మద్దతు ధరకు తక్కువగా అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. రైతులు నష్టపోకుండా పూర్తి పారదర్శక ధర వచ్చే విధంగా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వై.అప్పారావు, వ్యవసాయాధికారి వైవిఎస్.ప్రసాద్, కాశీపాడు సొసైటీ కార్యదర్శి ఇందుకూరి వెంకట రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో కేన్సర్ డే సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యమన్నారు. వరదల దాటిన వారు పరీక్షలు చేయించుకుని కేన్సర్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తమ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి పరీక్షలు చేస్తారన్నారు. ఆసుపత్రి ర్యాలీ ఆసుపత్రి నుంచి గణపవరం ప్రధాన వీధుల్లో సాగింది. కార్యక్రమంలో పద్మజ, ఆరోగ్య కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం : పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీ అర్బన్ పిహెచ్‌సిలో నేషనల్ కేన్సర్ డే సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సోనియా మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిని స్క్రీనింగ్ పరీక్ష ద్వారా గుర్తించవచ్చన్నారు. కేన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. చర్మం లేదా నోటిలో పుండ్లు, పూత ఏర్పడడం తదితర లక్షణాలుంటే కేన్సర్ పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ధనలక్ష్మి, జ్యోతి, అరుణ, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కాళ్ల : ఈ నెల 14వ తేదీ నుంచి ఇంటింటా సర్వేలో భాగంగా కేన్సర్ అనుమానిత లక్షణాలు ఉంటే చికిత్స చేయించుకుంటే ఈ వ్యాధి నుంచి రక్షణ పొందొచ్చని వైద్యాధికారి డాక్టర్ ఎస్.సునీల్ అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ క్రీలకు రొమ్ములో గడ్డలు, నోటి పూత ఎక్కువ రోజులు ఉంటే ముందుగానే గమనించి చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.భవాని, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం : వైఎన్ కళాశాల సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహనా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసాపురం అశ్విని హాస్పిటల్ ప్రముఖ గైనకాలజిస్ట్ ఎం.పద్మావతి విచ్చేసి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో కేన్సర్ బారిన పడే అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా అతివలకు రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్లు ఎక్కువని వీటిని ముందుగా గుర్తిస్తే చికిత్స అందించి నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, హెచ్‌ఒడి డైరెక్టర్ డాక్టర్ చినిమిల్లి శ్రీనివాస్, సామాజిక సేవా విభాగం సమన్వయ కర్త భీమడోలు ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : జాతీయ కేన్సర్ అవగాహనా దినోత్సవం సందర్భంగా లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద, అరట్లకట్ట సచివాలయం వద్ద అవగాహనా కార్యక్రమాలను ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా డాక్టర్ నవ్య జీవన్, డాక్టర్ సత్య సౌజన్య నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, ముత్యవల్లి, సిహెచ్ఒ ఎస్ఎస్‌పి ఎలిజబెత్, ఎఎన్ఎం అమలేశ్వరరావు, డి.కమల, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - నరసాపురం

నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పునరుద్ధరించిన నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను శాంతియుతంగా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. భూ యజమానుల గుర్తింపు, ఓటరు జాబితా తయారీ కచ్చితంగా చేపట్టాలన్నారు. తొలిదశలో నీటి వినియోగదారుల సంఘాలు ఎన్నికలు, రెండో దశలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, మూడో దశలో ప్రాజెక్టు కమిటీ ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్, ఇన్‌ఛార్జి ఆర్ఐ లక్ష్మీనారాయణ, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

నాణ్యమైన పెట్రోల్ అందించండి

తూనికలు, కొలతల శాఖ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ రాజేష్

ప్రజాశక్తి - ఉండి

వినియోగదారులకు నాణ్యమైన పెట్రోలు, డీజిల్ కచ్చితమైన తూకంతో అందించాలని పెట్రోల్ బంకు నిర్వాహకులకు తూనికలు, కొలతల శాఖ కోనసీమ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ కె.రాజేష్ సూచించారు. గురువారం సాయంత్రం ఎన్ఆర్‌పి అగ్రహారంలోని సాయి పెట్రోల్ బంక్‌ను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. పెట్రోల్ బంకుల సాధారణ తనిఖీలో భాగంగా జంక్షన్ విధానాన్ని అనుసరించి కోనసీమ జిల్లాకు చెందిన తాను ఆకివీడు, ఉండి, భీమవరం ప్రాంతాల్లోని పెట్రోల్ బంకులను తనిఖీ చేసినట్లు తెలిపారు. పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలు, తూకం, రేటు, భద్రతా ప్రమాణాలు, వినియోగదారులకు అందించాల్సిన ఉచిత సౌకర్యాలైన గాలి పంపు, తాగునీరు, టాయిలెట్స్ తనిఖీ చేసినట్లు తెలిపారు. వినియోగదారులు పెట్రోల్ బంకుల్లో ఉచితంగా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ తనిఖీలో తూనికలు, కొలతల శాఖ భీమవరం ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు, సాయి పెట్రోల్ బంక్ మేనేజర్ కాశీశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
డిఓపి ఐ.ఏ.నెం.24/24
పిటీషన్:
1) లింగం కృష్ణ ... పిటీషనర్
Vs
2) ఓసూరి రాంబాబు వగైరా ... రెస్పాండెంట్స్ / 1 నుండి 19
ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పిటీషనర్ రెస్పాండెంట్స్ పై ఇన్ఫోర్మేషన్ డిక్రీ చేయమని డిఓపి ఐ.ఏ.నెం. 24/2024 వ్యాజ్యము దాఖలు చేసియున్నారు. యావన్మందికి ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా రెస్పాండెంట్లు ఇందు వచ్చిన ఆర్ పై వాయిదా అయి యెడల ది.06-12-2024 వ సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు శ్రీ కోర్టు వారి ముందు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై శ్రీ కోర్టు వారి ముందు తగు విధంగా జవాబులు తెలియజేయవలెను. లేని యెడల మీ గైర్హాజరీగా ఎక్స్ పార్టీ తీర్మానించబడును. ఈ ప్రకటన ఉపాధికూడా తెలియజేయడమైనది.
నరసాపురం, తేది:07.11.2024
కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం
తంగెళ్ల వెంకటేశ్వర రావు
అడ్వకేట్, M.A, B.L.,
నరసాపురం-534275, ప.గో.జిల్లా.
సెల్: 9848273438 & 7013351332

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

పాలకొల్లు :యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సిఐ ఎ.శ్రీనివాస్ సూచించారు. పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నెహ్రూ యువకేంద్రం జిల్లా వారి ఆధ్వర్యంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు, యాంటీ డ్రగ్స్ కమిటీ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, సిఐ ఎ.శ్రీనివాస్ విచ్చేశారు. సిఐ మాట్లాడుతూ నేటి తరం యువత డ్రగ్స్ తీసుకుంటున్నారని, ఇది ప్రమాదకరమని తెలిపారు. అనంతరం వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నెహ్రూ యువ కేంద్రం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్ కె.రాజేష్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐక్యూఎసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం పాల్గొన్నారు.

శిశువుల రక్షణపై అవగాహన

తణుకు:భారత రాజ్యాంగం ప్రకారం తల్లి గర్భం నుండే పిల్లలకు హక్కులు ఉన్నాయని తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు అన్నారు. ఛైర్మన్, గౌరవ జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు అంగన్వాడీ సెంటర్లో శిశు సంరక్షణ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కొరు వెంకటేశ్వర్లు, అంగళ్ల అజయ్‌కుమార్ మాట్లాడారు. నవజాత శిశువుల ఎలా సంరక్షించుకోవాలో తెలిపారు. అంగన్వాడీ టీచర్ రాజకుమారి మాట్లాడారు.

నరసాపురం : శిశు రక్షణ దినోత్సవం సందర్భంగా నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అర్బన్ అంగన్వాడీ సెంటర్లో అంగన్వాడీ వర్కర్స్, టీచర్స్, గర్భిణులకు శిశువుల రక్షణ అంశం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథులుగా న్యాయ సేవా కమిటీ సభ్యులు వైడి.ఫణికర్, ప్యానల్ న్యాయవాది కె.లక్ష్మి పద్మజ పాల్గొన్నారు. వైడి ఫణికర్ మాట్లాడుతూ శిశు మరణాలు తగ్గించడమే ఈ దినోత్సవ ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్రమంలో లక్ష్మి పద్మజ, అర్బన్ అంగన్వాడీ సెంటర్ టీచర్ నాగమణి పాల్గొన్నారు.

10 నుంచి 'మన్యసీమ దర్శిని' విహార యాత్ర బస్సు సర్వీస్

డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి

భీమవరం టౌన్:వినోద విజ్ఞానాలతో పాటు మానసికోల్లాసం కలిగించే ఆహ్లాదకరమైన అనుభవం 'మన్యసీమ దర్శిని' ఆర్‌టిసి బస్సు సర్వీసు అని, ఈ నెల 10వ తేదీ నుండి ఈ సర్వీసును భీమవరం డిపో నుంచి ప్రారంభిస్తున్నామని డిపో మేనేజర్ పిఎన్ వివి.సత్యనారాయణ మూర్తి తెలిపారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10వ తేదీ ఉదయం 4 గంటల నుంచి భీమవరం డిపో నుంచి ప్రారంభిస్తున్నామని, ఈ మన్యసీమ దర్శిని బస్సు భీమవరం డిపో నుండి బయలుదేరి కోరుకొండ లక్ష్మీనారాయణ నరసింహస్వామి ఆలయం, సీతపల్లి గుడిసెపానమ్మ ఆలయం, మారేడుమిల్లి కాఫీ గార్డెన్స్, మిరియాల గార్డెన్స్, రబ్బర్ ప్లాంటేషన్, జలపాతాలు మొక్కలు, జలతరంగిని వ్యూ పాయింట్, పాములేరు వాగు దర్శించి తిరుగు ప్రయాణంలో రాజమండ్రి ఇస్కాన్ టెంపుల్ పుష్కరాల రేవు మీదుగా రాత్రి 10 గంటలకు భీమవరం చేరుకుంటుందని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ రూ.600, అల్ట్రాడీలక్స్ రూ.700 చొప్పున సర్వీసు ఛార్జీలని, ఈ అవకాశాన్ని వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఈ బస్సుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందన్నారు. మరిన్ని వివరాలకు 73829 24754, 08816-239100, 96660 89036 లను సంప్రదించాలన్నారు.

పంచారామ క్షేత్రదర్శిని టూర్ ప్యాకేజీ

పంచారామాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం సామర్లకోటలోని మహాశివుని దర్శించుకోవడానికి ఈ కార్తీక మాసంలో ప్రతి ఆదివారం రాత్రి భీమవరం డిపో నుండి 'పంచారామదర్శిని' టూర్ ప్యాకేజీ బస్సులను నడుపుతున్నామని డిపో మేనేజర్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ బస్సుల్లో సీట్లు అడ్వాన్స్ బుకింగ్ చేసుకునే వారు భీమవరం బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్ ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు
ఐ.ఏ.నెం.65/2024 ఇన్ ఓ.ఎస్.నెం. 77/2022
పిటీషన్:
కోసూరి వెంకట సుబ్బారావు ...పిటీషనరు
మరియు
నమ్మిగెడ్డ వేంకటేశ్వరరావు & నమ్మిగెడ్డ లీలా ...రెస్పాండెంట్స్
టు: ఆర్-5:
నమ్మిగెడ్డ మురళి, తండ్రి: లేటు నమ్మిగెడ్డ వేంకటేశ్వరరావు, R/o. డో.నెం.9-134, కమ్మరి బజారు, సీతమ్మగారి హోటల్ లైన్, కెనాల్ ప్రక్కన, కైకలూరు గ్రామం మరియు మండలం, ఏలూరు జిల్లా.
పై తెలిపిన పిటీషనులో రెస్పాండెంటు ఆర్-5 యొక్క హాజరు నిమిత్తం వాయిదా ది.25-11-2024వ తేదీ అయి ఉన్నది. కావున తమరు రోజు ది.25-11-2024 ఉదయం గం॥10:30 ని॥లకు కోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు కావలెను. లేనియెడ వారి పరోక్షములో నోటీసు తీర్మానించబడును.
సింహాద్రి సుబ్బారావు
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
07-11-24. ఫోన్: 94416 53989

In The Court Of The Principal Junior Civil Judge (Junior Division) Bhimavaram
O.S.No. 298/2023
Plaintiff: Pathiwada Venkata Ramana
Defendant: Meragani Appa Rao, S/o. Appa Rao, R/o. Flat No.S-3, Subhadra Residency, Srirampuram, Bhimavaram-2.
పై నెంబరు దావాలో ప్రతివాదికి సమన్సు అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను పంపించినను సదరు ప్రతివాది ఉద్దేశ్యపూర్వకంగా అందుకొనియుండుట లేదు. కావున సదరు ప్రతివాదికి దావా సమను అమలు నిమిత్తం ది.19-11-2024 సం॥రం తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు సదరు ప్రతివాది స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని ఎడల మీ పరోక్షములో తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
R.SRINIVASA MURTHY
Bhimavaram, Advocate, Bhimavaram.
05-11-24. Cell: 9948122644

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.18/2019 in O.S.249/2015
Between:
నాళం కనకదుర్గ వెంకటేశ్వరరావు ...పిటీషనరు/డిక్రీ హోల్డర్
బంగారు శ్రీనివాస బాబు ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డెబ్టర్
To.
బంగారు శ్రీనివాస బాబు, తండ్రి మాధవ మాణిక్యాలరావు, వయస్సు 50 సం॥లు, పురుషుడు, వ్యాపారం, పాలకొల్లు, పాలకొల్లు మండలం.
పై నెంబరు దావాలో అమలు గ్రంథములో జడ్జిమెంట్ డెబ్టర్ యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలు ఆస్తిని ది.25-11-2024 ఉ.గం.10.30 ని.ల బహిరంగ వేలం పై తెలిపిన కోర్టు వారి ముందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసినవారు వేలంలో పాల్గొని క్రయం పొందగలరు.
షెడ్యూల్
West Godavari District, Palakol Sub Registration District, Palakol Mandal, Palakol Municipal Limits an extent of 117.20 square yards of site and an RCC roof building therein consists ground floor and 1st floor bearing Door No.17A-5-12 in the following items.
Item No.1:
An Extent of 45.18 square yards bounded by:
East : Road
West : Item No.2
North: Wall of Golla Venkateswara Rao
South : Joint lane.
Item No.2 :
An Extent of 54.12 square yards bounded by.
East : Item No.1
West : Site of Manepalli Anasuya
North: Korukonda Datta Rao and wall of item No.3
South : Joint lane.
Item No.3:
An Extent of 17.20 square yards bounded by.
East : Wall of Korukonda Datta Rao.
West : Site of Manepalli Anasuya
North: Wall of Korukonda Datta Rao.
South : Site of Item No.1 and 2 With all easementary rights.
Amin Value : Rs.38,00,000/-
D.H.R. Value : Rs.6,28,667/-
(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)
పాలకొల్లు మేడపాటి వెంకట రామారెడ్డి
05-11-2024 న్యాయవాది, పాలకొల్లు.

In The Court Of The Principal Junior Civil Judge (Junior Division) Bhimavaram
I.A.No.861/2023 in O.S.No.298/2023
Petitioner /Plaintiff:
Pathiwada Venkata Ramana
Respondent /Defendant:
Meragani Appa Rao, S/o. Appa Rao, R/o. Flat No.S-3, Subhadra Residency, Srirampuram, Bhimavaram-2.
పై నెంబరు దావాలో ఐ.ఏ.నెం.861/2023 నెంబరులో రెస్పాండెంటుకు నోటీసులు అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిస్టర్ పోస్టు ద్వారాను పంపించినను సదరు రెస్పాండెంట్ ఉద్దేశ్యపూర్వకంగా అందుకొనియుండుట లేదు. కావున సదరు రెస్పాండెంటుకు నోటీసులు అమలు నిమిత్తం ది.19-11-2024 సం॥రం తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు సదరు ప్రతివాది స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని ఎడల మీ పరోక్షములో తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
R.SRINIVASA MURTHY
Bhimavaram, Advocate, Bhimavaram.
05-11-24. Cell: 9948122644

In The Court Of The Principal Junior Civil Judge (Junior Division) Bhimavaram
O.S.No. 203/2024
వాది: Tiriveedhi Venkata Subba Rao
ప్రతివాది: Belle RAvi & Others
3వ ప్రతివాది: Jakkamsetti Bharathi, W/o. Krishna Murthy, R/o. D.No.5-48/5, B.C.Colony, NRP Agraharam, Undi, Undi Mandal.
పై నెంబరు దావాలో 3వ ప్రతివాదికి దావా సమన్సు అనేక పర్యాయములు శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిస్టరు పోస్టు ద్వారాను పంపించినను సదరు ప్రతివాది ఉద్దేశ్యపూర్వకంగా అందుకొనియుండుట లేదు. కావున సదరు 3వ ప్రతివాదికి దావా సమను అమలు నిమిత్తం ది.21-11-2024 సం॥రం తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు సదరు 3వ ప్రతివాది స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని ఎడల మీ పరోక్షములో తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
R.SRINIVASA MURTHY
Bhimavaram, Advocate, Bhimavaram.
05-11-24. Cell: 9948122644

మహారాజశ్రీ తణుకు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు
O.S.No. 836/2022
Between:
M/s. Union Bank of India Peravali Branch, (Erst Andhra Bank) Rep. By its Manager Tanuku. ...Plaintiff
AND
1) Kannepamula Shyam Babu
2) Kannepamula Ratna Kumari ...Defendants
TO:
1) Kannepamula Shyam Babu, S/o. Krupavaram, D.No.23-2-1, Vanapalli Vari Street, Sajjapuram, Tanuku.
2) Kannepamula Ratna Kumari, W/o. Shyam Babu, D.No.23-2-1, Vanapalli Vari Street, Sajjapuram Tanuku.
పై నెంబరు దావాలో వాది కోర్టు ద్వారా మీకు నోటీసును పంపించి ఉన్న మీరు తీసుకోకుండా ఎవైడ్ చేస్తున్నందున సబ్స్టిట్యూటెడ్ సర్వీసు ద్వారా నోటీసు మీకు తెలియపరచమని చున్నందున పై నెంబరు దావా వాయిదా ది.22-11-2024వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు స్వయంగా గాని లేదా మీ తరపున అడ్వకేట్ గారు ద్వారా గాని కోర్టుకు హాజరై తమ ఆక్షేపణలు తెలియపరచుకొనవలసి వచ్చును. లేని ఎడల సదరు గౌరవ న్యాయస్థానం వారు ఏకపక్షంగా తీర్మానము చేయుదురు అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
కామన మునిస్వామి
తణుకు, అడ్వకేట్, తణుకు.
05-11-24. సెల్:9441447403

ప్రకటన
మహారాజశ్రీ ఏలూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు :: ఏలూరు జిల్లా
M.V.O.P.No. 205/2024
పిటీషన్:
నల్లా నిర్మల & Other ...పిటీషనరు
అండ్
గోరింక అలివర్ & Other ...రెస్పాండెంట్లు
టు: ఆర్-2: మేక ఆర్.ప్రసాద్ బాబు, తండ్రి: దేవర రాజు, R/o. 4-46, మంగలగొట్టు పాలెం గ్రామం, లక్ష్మణేశ్వరం, నరసాపురం మండలం, ప.గో॥ జిల్లా. ఓనర్ ఆఫ్ మోటార్ సైకిల్ నెం.: AP 39 BW 5874.
మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి.నెం. 205/2024లో పై తెలిపిన 2వ ప్రతివాది అయి ఉన్నారు. మీకు ఎన్నిసార్లు సమన్సు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా వారి కోర్టు వారి యొక్క ఉత్తర్వు ప్రకారం మీరు నవంబరు నెల 27వ తేదీ 2024వ సంవత్సరం ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు కావలెను. లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ: 27-11-2024
నిమ్మల వీరవెంకట సత్యనారాయణ సెల్:98482 13165
నిమ్మల నవీన్, సెల్: 897812 27822
అడ్వకేట్స్, ఏలూరు.

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు :: ప.గో॥జిల్లా
M.V.O.P.No. 36/2023
పిటీషన్:
మన్నే వెంకట సత్యనారాయణ ...పిటీషనరు
అండ్
మొల్లి శ్రీను @ శ్రీరామ్ & Other ...రెస్పాండెంట్లు
టు: ఆర్-1 మరియు ఆర్-2:
ఆర్-1: మొల్లి శ్రీను @ శ్రీరామ్, తండ్రి: వెంకటేశ్వరరావు, R/o. శ్రీరామపురం, డి.యన్.ఆర్. కాలేజ్ రోడ్, భీమవరం టౌన్, ప.గో॥ జిల్లా. డ్రైవర్ ఆఫ్ మారుతి స్విఫ్ట్ కార్ నెం.: AP 35 K 0936.
ఆర్-2: బొల్లికొండ సురేష్, తండ్రి: ఆదినారాయణ, R/o. 3-191, పంచాయతీ ఆఫీస్ రోడ్, చిన్నమిరం గ్రామం, భీమవరం మండలం, ప.గో॥ జిల్లా. ఓనర్ ఆఫ్ మారుతి స్విఫ్ట్ కార్ నెం.: AP 35 K 0936.
మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి.నెం. 36/2023లో పై తెలిపిన 1, 2వ ప్రతివాదులు అయి ఉన్నారు. మీకు ఎన్నిసార్లు సమన్సు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా వారి కోర్టు వారి యొక్క ఉత్తర్వు ప్రకారం మీరు డిసెంబరు నెల 04వ తేదీ 2024వ సంవత్సరం ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు కావలెను. లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ: 04-12-2024
నిమ్మల వీరవెంకట సత్యనారాయణ సెల్:98482 13165
నిమ్మల నవీన్, సెల్: 897812 27822
అడ్వకేట్స్, భీమవరం.

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు :: ప.గో॥జిల్లా
M.V.O.P.No. 41/2023
పిటీషన్:
ఏడిద భారతి పద్మ అండ్ అదర్స్ ...పిటీషనరు
అండ్
ముద్దుల మణికంఠ & Other ...రెస్పాండెంట్లు
టు: ఆర్-1: ముద్దుల మణికంఠ, తండ్రి: శ్రీనివాస్, R/o. 30-39/2, ఉర్దూకల వారి వీధి, చెరుకువాడ గ్రామం, పెనుగొండ మండలం, ప.గో॥ జిల్లా. ఓనర్ కమ్ రైడర్ ఆఫ్ మోటార్ సైకిల్ నెం.: AP 39 GZ 1342.
మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి.నెం. 41/2023లో పై తెలిపిన 1వ ప్రతివాది అయి ఉన్నారు. మీకు ఎన్నిసార్లు సమన్సు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు వారి యొక్క ఉత్తర్వు ప్రకారం మీరు డిసెంబరు నెల 04వ తేదీ 2024వ సంవత్సరం ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు కావలెను. లేని ఎడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ: 04-12-2024
నిమ్మల వీరవెంకట సత్యనారాయణ సెల్:98482 13165
నిమ్మల నవీన్, సెల్: 897812 27822
అడ్వకేట్స్, భీమవరం.